క్లుప్తంగా

డ్వాక్రా ఉత్పత్తుల విక్రయ బజారు ఏర్పాటు



తునిలో ఏర్పాటు చేసిన డ్వాక్రా సంఘాల ఉత్పత్తుల విక్రయ బజారు

తుని: ప్రజలకు నాణ్యమైన వస్తువులను అందించడంలో మహిళా సంఘాలు ముందంజలో ఉన్నాయని మెప్మా అధికారి శ్రీదేవి అన్నారు. పట్టణంలోని సీతారాంపురం తాడిచెట్టు సెంటర్‌లో శనివారం డ్వాక్రా ఉత్పత్తుల విక్రయ బజారును ఏర్పాటు చేశారు. మహిళలు తయారు చేసిన వస్త్రాలు, ఆభరణాలు, తినుబండారాలు, చేతి ఉత్పత్తులు తదితర వస్తువులకు అనూహ్య స్పందన లభించింది. ప్రజల నుంచి వస్తున్న ఆదరణను దృష్టిలో పెట్టుకుని మరిన్ని ఉత్పత్తులను తయారు చేస్తామని డ్వాక్రా సంఘాల టీం లీడర్లు చెప్పారు. ప్రభుత్వం ఇటువంటి సంఘాలకు చేయూత కల్పించాలని పలువురు కోరుతున్నారు.

జీడిపిక్కల ఫ్యాక్టరీ వద్ద కార్మికుల ఆందోళన



చిన్నింపేట జీడిపిక్కల ఫ్యాక్టరీ వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

ఏలేశ్వరం: తమ సమస్యలు పరిష్కారించాలని కోరుతూ మండలంలోని చిన్నింపేట జీడిపిక్కల ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికులు శనివారం ఆందోళన చేశారు. కార్మికులు ఫ్యాక్టరీ వద్ద ఆందోళన చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాజమాన్యం తమ న్యాయమైన డిమాండ్లను నేరవేర్చాలన్నారు. మూసివేసిన ఫ్యాక్టరీని వెంటనే తెరిపించాలన్నారు. ఫ్యాక్టరీ మూసివేయడంతో తామంతా ఉపాధి కోల్పోయామని వాపోయారు. యాజమాన్యం ఫ్యాక్టరీని తెరచి తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తిక వనసమారాధన



ఏలేశ్వరంలో ఉసిరి చెట్టుకు పూజలు చేస్తున్న భక్తులు

ఏలేశ్వరం: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలో శనివారం వనసమారాధన ఏర్పాటు చేశారు. పట్టణ శివారులోని తిరుమాలి వెళ్లే రహదారిని ఆనుకుని సామంతుల వారి పొలంలో సామంతుల రామన్న అండ్ బ్రదర్స్ ఆధ్వర్యంలో వనసమారాధన నిర్వహించారు. తొలుత ఉసిరిచెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంతో పాటు తిరుమాలి గ్రామం నుంచి సుమారు 3 వేల మంది మహిళలు, అయ్యప్పస్వాములు, భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో సామంతుల అప్పలస్వామి, నీలంబరరావు, సామంతుల గోపి, మూది నారాయణస్వామి, కోరాడ కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి ఆలయ వార్షికోత్సవాలు

తొండంగి: దానవాయిపేటలో సాగర తీరాన వేంచేసిన సాయిబాబా ఆలయ వార్షికోత్సవాలు ఈ నెల 28 నుంచి నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకుడు శంకరణం వెంకటరాజు శనివారం తెలిపారు. ఆలయాన్ని నిర్మించి 12 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దాతల సహకారంతో వార్షికోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. 28 నుంచి మూడు రోజుల పాటు సాయిబాబాకు పంచహారతులు, అభిషేకాలు, పూజలు, సత్యవ్రతాలు, నవంబర్ 1న మహాన్నదానం నిర్వహించనున్నట్టు తెలిపారు.

ముప్పిడి కుటుంబానికి పరామర్శ



వెంకటనగరంలో బాధితుడికి ఆర్థిక సాయం అందజేస్తున్న మురళీ కృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని వెంకటనగరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు ముప్పిడి అప్పలకొండ కుటుంబాన్ని ఆ పార్టీ నియోజకవర్గ నాయకుడు ముదునూరి మురళీరాజు శనివారం పరామర్శించారు. అప్పలకొండ ఇటీవల అనారోగ్యానికి గురై ఆపరేషన్ చేయించుకొన్నారు. విషయం తెలుసుకున్న మురళీరాజు వెంకటనగరంలోని ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని రూ.ఐదు వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వైఎస్సార్ సీపీ శ్రేణులకు ఏ ఆపద వచ్చినా తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ముప్పిడి నూకరాజు, బొల్లు నాగేశ్వరరావు, మాగాపు శివ తదితరులు పాల్గొన్నారు.

చివరిలో కలవరం

- తుపాను హెచ్చరికలతో అన్నదాతల్లో అలజడి
- మెట్టలో జోరుగా వరికోతలు
- 90 శాతం విస్తీర్ణంలో పక్వానికి చేరిన పంట



జగన్నాథపురంలో పనలపై ఉన్న వరి పంట



కోటనందూరులో పక్వానికి చేరిన వరిపైరు

కోటనందూరు: ఆరుగాలం కష్టించి సాగు చేసిన పంట ఇంటికి చేరే వరకూ రైతన్నకు దినదినగండంగానే ఉంటోంది. ఏటా ఇదే పరిస్థితిని ఎదుర్కొంటూ అన్నదాత ముందుకు సాగుతున్నాడు. మెట్ట ప్రాంతంలో సాగునీటి లభ్యత అంతంతమాత్రంగానే ఉండంతో వర్షం, సాగునీటి ప్రాజెక్టులపై ఆధారపడి రైతులు వరి సాగు చేస్తున్నారు. జూలై, ఆగస్టు నెలల్లో ఖరీఫ్ ప్రారంభమై డిసెంబర్‌తో ముగుస్తుంది. ఏటా నవంబర్, డిసెంబర్ నెలలో సంభవించే తుపానులు వరిసాగుపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. తాజా తుపాను హెచ్చరికలు అన్నదాతను కలవరపెడుతున్నాయి. బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రెండు రోజుల్లో తుపానుగా మారి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ చేసిన హెచ్చరికలతో మెట్టప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వర్షాలు కురిస్తే తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

40 వేల ఎకరాల్లో సాగు

ఈ ఏడాది తుని సబ్‌డివిజన్ పరిధిలోని కోటనందూరు, తుని, తొండంగి, రౌతులపూడి, శంఖవరం మండలాల్లో 40 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. బోర్లు, నీటి వసతులు ఉన్నచోట ముందుగానే నాట్లు వేశారు. తొలుత సాగు చేసిన 30 శాతం పంట ఇప్పటికే కోత కోయగా వర్షాధారంగా ఆలస్యంగా వేసిన మిగిలిన 70 శాతం పంట దాదాపుగా పక్వానికి చేరింది. సబ్ డివిజన్ పరిధిలో మరో 10 నుంచి 15 రోజుల్లో కోతలు పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయి.

పనలపై పంట

తుని నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో రైతులు వరి కోతలు కోయగా పంట పొలాల్లో పనలపై ఉంది. ఈ నేపథ్యంలో తుపాను హెచ్చరికలతో రైతులు బెంబేలెత్తుతున్నారు. వడివడిగా పంటను ఒబ్బిడి చేసుకుంటున్నారు. పలువురు రైతులు మెషీన్లతో కోతలు కోయిస్తున్నారు.

అపరాల సాగుపై ప్రభావం

ఏటా నవంబర్, డిసెంబర్ నెలల్లో సంభవించే తుపానులు రబీగా సాగు చేసే అపరాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. సాధారణంగా రైతులు కోతలు కోయడానికి వారం, 10 రోజుల ముందు వరిపంటలో మినుము, పెసర విత్తనాలు చల్లడం పరిపాటి. కోత పూర్తయి కళ్లాల్లో పనలు ఎత్తే సమయానికి మొక్కలు వస్తుంటాయి. ఇటాంటి పరిస్థితుల్లో వర్షాలు కురిస్తే చల్లిన అపరాల విత్తనాలు కుళ్లిపోయి రబీసాగు దెబ్బతింటోంది. ఫలితంగా లాభదాయక అపరాలసాగులో అన్నదాతలు నష్టపోతున్నారు.

ఏటా అవస్థలు తప్పడం లేదు



తుపానులతో ఏటా అవస్థలు తప్పడం లేదు. గతేడాది కూడా పంట చేతికొచ్చే సమయంలో వచ్చిన తుపానుతో బాగా నష్టపోయాం. ప్రస్తుతం కొంత వరకూ పంటలు కోసేసి పనలపై ఉన్నాయి. ఎక్కువ మొత్తంలో కోతకు సిద్ధంగా ఉన్నాయి. ఇప్పుడు వర్షం కురిస్తే రైతులు తీవ్రంగా నష్టపోతారు. పెట్టిన పెట్టుబడి నీటిపాలయ్యే ప్రమాదం ఉంది.

– అప్పలనాయుడు, రైతు, కేఈ చిన్నయ్యపాలెం

కోతలు వాయిదా వేసుకోండి



తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వరి కోతలు కోసుకోవాలి. వాతావరణం మారితే కోతలు వాయిదా వేసుకోవాలి. ఇప్పటికే కోసి పనలపై ఉన్న పంటను రైతులు త్వరితగిన ఒబ్బిడి చేసుకోవాలి.

– చంద్రశేఖర్, ఏఓ, కోటనందూరు

లంపకలోవ హైస్కూల్‌లో మాక్ పోలింగ్



మాక్ పోలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

ప్రత్తిపాడు: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని లంపకలోవ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఉపాధ్యాయులు తడ్డే బంగారు నాయుడు, కాండ్రేగుల ప్రసన్న లక్ష్మి అధ్వర్యంలో తరగతికి ఇద్దరు వంతున ఎన్నికల్లో పోటీ చేయగా విద్యార్థులు ఉత్సాహంగా ఓటింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు. ఓటు హక్కును వినియోగించుకోవడం, ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన తదితర ప్రక్రియను ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. భారత రాజ్యాంగం, ఎన్నికల ప్రక్రియపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు మాక్ పోలింగ్ నిర్వహించినట్టు ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో మండల యూటీఎఫ్ అధ్యక్షుడు కోడి శ్రీనివాసరావు, ఎస్‌జీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గరికపాటి సురేష్, ఏపీయూఎస్ జిల్లా కార్యదర్శి కంచి అప్పారావు, హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సైన్స్ ఫెయిర్ పోటీలు



తయారు చేసిన ప్రాజెక్టులతో విద్యార్థినులు



సైన్స్ ఫెయిర్ పోటీల్లో ప్రాజెక్టులను పరిశీలిస్తున్న అతిథులు

తుని: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ సైన్స్ ఫెయిర్‌లో వెలుగు చూసిందని శ్రీప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్ అన్నారు. స్థానిక రోటరీక్లబ్ భవనంలో శనివారం రంగం యువజనోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు సైన్స్ ఫెయిర్ పోటీలు నిర్వహించారు. తుని, పాయకరావుపేట పరిసర ప్రాంతాల్లోని పాఠశాలల నుంచి 25 జట్లు పోటీలో పాల్గొన్నాయి. జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో నిర్వహించిన పోటీలకు న్యాయనిర్ణేతలుగా షేక్ నాగూర్, టి.శేషగిరి, సీహెచ్ లోవరాజు వ్యవహరించారు. ముఖ్య అతిథిగా హాజరైన విజయ్‌ప్రకాష్ విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను పరిశీలించి అభినందించారు. జూనియర్స్ విభాగంలో ప్రథమ స్థానంలో లయోలా, ద్వితీయ స్థానంలో శ్రీప్రకాష్, సీనియర్స్ విభాగంలో ప్రథమ స్థానంలో గాయత్రి, ద్వితీయ స్థానం పాయకరావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు కై వసం చేసుకున్నారని ప్రోగ్రాం కమిటీ చైర్మన్ టి.నాగిరెడ్డి తెలిపారు. రోటరీక్లబ్ తుని శాఖ అధ్యక్షుడు సీహెచ్ మంగరాజు, కార్యదర్శి వీర్రాజు, కోశాధికారి కిశోర్‌రెడ్డి, బుచ్చిరాజు, గణేష్ పాల్గొన్నారు.

జార్ఖండ్‌లో గెలుపుపై లిబరేషన్ సంబరాలు



ప్రత్తిపాడు లిబరేషన్ కార్యాలయంలో విజయోత్సవం

ప్రత్తిపాడు: జార్ఖండ్ రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ అభ్యర్థులు విజయం సాధించడంతో మండలంలోని ఆ పార్టీ కార్యకర్తలు శనివారం సాయంత్రం సంబరాలు నిర్వహించారు. జార్ఖండ్‌లో సింద్రీ నియోజకవర్గం నుంచి చంద్రదేవ్ మహతో, నిర్సా నుంచి అరుప్ ఛటర్జీ గెలుపొందడంతో స్థానిక లిబరేషన్ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి బుగత బంగార్రాజు కేక్ కట్ చేసి విజయోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో లిబరేషన్ అనుబంధ సంస్థల నాయకులు మానుకొండ లచ్చబాబు, లోవమ్మ, పిల్ల ప్రభుదాస్, నేతల రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రియాంక గాంధీ విజయంపై కాంగ్రెస్ హర్షం

ప్రత్తిపాడు: కేరళ రాష్ట్రంలోని వయనాడ్ లోక్‌సభ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో ప్రియాంక గాంధీ విజయం సాధించడం పట్ల కాంగ్రెస్ హర్షం వ్యక్తం చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. మెజార్టీలో రాహుల్ గాంధీ రికార్డును బద్దలు కొట్టి 4,08,036 ఓట్ల ఆధిక్యతతో తొలి ఎన్నికలోనే ప్రియాంక గాంధీ గెలుపొందడం పట్ల పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఈరుగుల చక్రం, కందిమళ్ల సామ్యేలు, డి గోపయ్య పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

గండేపల్లి: జాతీయ రహదారిపై మోటార్ సైకిలిస్టుకు శనివారం త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. స్థానికుల కథనం ప్రకారం కాకినాడ నుంచి మోటార్ సైకిల్‌పై తిరుమలాయపాలెం అత్తారింటికి వెళుతున్న సుబ్రహ్మణ్యం మండలంలోని ఎన్టీ రాజాపురం వైపు వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా రాజమహేంద్రవరం వైపు నుంచి వస్తున్న ట్రాలీ ఢీకొంది. ఈ ప్రమాదంలో సుబ్రహ్మణ్యం మోటార్ సైకిల్‌తో సహా రోడ్డుపై పడిపోవడంతో స్వల్పగాయాలయ్యాయి. లారీ డ్రైవర్ అప్రమత్తమై లారీని అదుపుచేయడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు సహాయక చర్యలు చేపట్టి క్షతగాత్రుడికి పక్కకు తరలించారు.



ప్రమాదస్థలం వద్ద లారీ, ప్రయాణికులు

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



తామరాడలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు



సూరంపాలెం అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

గండేపల్లి: తెలియని వయసులో ప్రేమ, ఆకర్షణలకు గురికావద్దని సీఐ వైఆర్కే శ్రీనివాస్ సూచించారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో శనివారం ఎస్సై యువి శివనాగబాబు ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడ్ టచ్–బ్యాడ్ టచ్, స్వీయ రక్షణ, బాల్య వివాహాలు, సోషల్ మీడియాలో పరిచయాలు, ఆన్‌లైన్‌లో వేధింపులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వీడియోలు, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కిర్లంపూడి: సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు సూచించారు. తామరాడ జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, ఎస్సై సతీష్ ఆధ్వర్యంలో శనివారం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, వాటి నిర్మూలనకు తీసుకోవాలసిన జాగ్రత్తలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సోషల్ మీడియా వేధింపులు వంటి అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. ద్విచక్ర వాహన దారులు విధిగా హెల్మెంట్ ధరించాలని సూచించారు. ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు

జగ్గంపేట: మండలంలోని రామవరం వద్ద పలు చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు జగ్గంపేట ఎస్సై రఘునాథరావు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. గోకవరం గ్రామానికి చెందిన ప్రేమ్ కుమార్ (32) పలు చోట్ల కోళ్లు, మేకలు, సెల్‌ఫోన్లను చోరీ చేస్తున్నాడు. రామవరం వద్ద శనివారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. నిందితుడు బైక్‌పై వెళుతుండగా గుర్తించి అరెస్టు చేశారు. అతని నుంచి రూ.70 వేల విలువైన కోళ్లు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు చెప్పారు.

సారాతో వ్యక్తి అరెస్టు



నిందితుడు, స్వాధీనం చేసుకున్న సారాతో ప్రత్తిపాడు ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది

ప్రత్తిపాడు: కిర్లంపూడి మండలం గెద్దనాపల్లిలో సారా స్థావరాపై దాడులు నిర్వహించి, సారాతో ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్టు ప్రత్తిపాడు ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ తెలిపారు. కాకినాడ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ సిబ్బందితో గెద్దనాపల్లిలో దాడులు నిర్వహించామన్నారు. గ్రామానికి చెందిన గంటా రమణను అదుపులోకి తీసుకుని, అతని నుంచి 55 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్టు తెలిపారు.

1,400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రత్తిపాడు: స్థానిక సర్కిల్ పరిధిలోని కిర్లంపూడి మండలం కృష్ణవరంలో సారా స్థావరాలపై శనివారం ప్రత్తిపాడు ఎక్సైజ్ సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 1,400 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ తెలిపారు. ఈ దాడుల్లో కాకినాడ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ సీఐ కేవీ స్వామి, ప్రత్తిపాడు ఎక్సైజ్ ఎస్సై పునం వంశీరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయిబాబా జయంతి

కిర్లంపూడి: మండలంలోని రామచంద్రపురంలో సత్యసాయిబాబా జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. గ్రామ సర్పంచ్ తుమ్మలపల్లి సాయి గుణశేఖర్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. జనసేన పార్టీ జగ్గంపేట ఇంచార్జి తుమ్మలపల్లి రమేష్ స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు సత్యసాయిబాబును దర్శించుకున్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు.

సత్యదేవుని దర్శించిన బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు



సత్యదేవుని సన్నిధిలో బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్, కుటుంబ సభ్యులు

అన్నవరం: భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ కుటుంబ సభ్యులతో కలిసి శనివారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి పండితులు స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందచేసి స్వామివారి ప్రసాదాలు బహూకరించారు. వారి వెంట బీజేపీ నాయకులు శింగిలిదేవి సత్తిరాజు, కామర్స్ చిరంజీవి ఉన్నారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

- రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్‌నాయక్
- గిరిజన గ్రామాల్లో పర్యటన



గిన్నెలారంలో గిరిజనులతో సమావేశమైన ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్‌నాయక్

రౌతులపూడి: సబ్‌ప్లాన్ ఏజెన్సీలో నివసిస్తున్న గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ డైరెక్టర్ వడిత్యా శంకర్ నాయక్ కోరారు. మండలంలోని సబ్‌ప్లాన్ ఏజెన్సీ గ్రామాలు పెద్దూరు, గిన్నిలారంలో శనివారం ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో గిరిజనులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. తమకు కులధ్రువీకరణ పత్రాలు రావడం లేదని, రహదారి, విద్యుత్ సదుపాయం కల్పించాలని కొండరెడ్లు కోరారు. కరెంట్ బిల్లు కట్టకపోతే కనెక్షన్ కట్ చేస్తామని విద్యుత్ అధికారులు బెదిరిస్తున్నారని గిరిజనులు వాపోయారు. దీనిపై ఎలక్ట్రికల్ ఏఈని శంకర్ నాయక్ ఆరా తీశారు. ఎస్టీ ఏరియాలో విద్యుత్ వినియోగదారులు కులధ్రువీకరణ పత్రం ఇవ్వకపోవడంతో కరెంట్ కనెక్షన్లు కట్ చేశామని విద్యుత్ ఏఈ తెలిపారు. రెండు నెలల్లో కుల ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామని, విద్యుత్ కనెక్షన్లు పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. అలాగే తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని గిరిజనులు కోరారు. కలెక్టర్‌తో చర్చించి ఆయా సమస్యలను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివరామకృష్ణయ్య, తహసీల్దార్ పోతురాజు, ఎంఈఓ కొండబాబు, పశువైద్యాధికారి వీర రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా మండల సమావేశం



సమావేశంలో మాట్లాడతున్న ములగపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి సౌందర్య

రౌతులపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల సర్వ సభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. తొలుత ములగపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సౌందర్య ఆసుపత్రి ద్వారా ప్రస్తుతం అందిస్తున్న వైద్యసేవలు, గ్రామాల్లో నిర్వహిస్తున్న 104 శిబిరాలు, ప్రస్తుత చలికాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అందిస్తున్న ఆరోగ్య సూచనలు గురించి వివరించారు. విద్యుత్, వ్యవసాయ సిబ్బంది తమ శాఖల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, రాయితీలను వివరించారు. ప్రస్తుతం గ్రామాల్లో వంట గ్యాస్ లబ్ధిదారులు ఆధార్, బ్యాంకు ఖాతాలను అప్‌డేట్ చేసుకోవడానికి అవస్థలు పడుతున్నారని, గ్యాస్ డీలర్లు, పౌర సరఫరా శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి సమస్యను పరిష్కరించాలని రౌతులపూడి–2 ఎంపీటీసీ సభ్యుడు బీరా రాజు సమావేశం దృష్టికి తెచ్చారు. అలాగే అపార్ నమోదు కోసం విద్యార్థుల జన్మ ధ్రువీకరణ పత్రం తప్పనిసరి అని అధికారులు చెప్పడంతో విద్యార్థులు, వారి తల్లితండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. అనంతరం రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు మండలంలోని సబ్‌ప్లాన్ ఏరియాలో పర్యటించనున్న నేపథ్యంలో సభ్యులు ప్రొటోకాల్ కోసం వెళ్లాలని ఎంపీడీఓ శివరామకృష్ణయ్య కోరారు. దీంతో సభ్యుల ఆమోదం మేరకు సమావేశాన్ని ముగించారు. కార్యక్రమంలో పలువురు ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజా హక్కుల సభను విజయవంతం చేయాలి

ప్రత్తిపాడు: ప్రభుత్వం సూపర్ సిక్స్ అమలులో విఫలమైంది...పీపుల్ సిక్స్ సాధిద్దాం..అనే ప్రధాన లక్ష్యంతో డిసెంబర్ 4వ తేదీన విజయవాడలో జరిగే ప్రజా హక్కుల సభను విజయవంతం చేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగత బంగార్రాజు పిలుపు నిచ్చారు. స్థానిక లిబరేషన్ పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలుగు నేల నుంచి మత రాజకీయాలను తరిమేసి, ప్రజా పోరాటాలతో నిజమైన ప్రజా ప్రతిపక్షాన్ని నిలబెడదామన్నారు. విద్యారంగం ప్రైవేటీకరణను, నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని, నిరుద్యోగులకు రూ.5 వేలు నిరుద్యోగ భృతి చెల్లించాలన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్మికులకు రూ.600 కనీస వేతనం, 200 రోజులు పనులు కల్పించాలన్నారు. పారిశుధ్య కార్మికులతో పాటు ఇతర కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేసి, వారిని ప్రభుత్వోద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. పీపుల్ సిక్స్ సాధన కోసం తలపెట్టిన ఈ ప్రజా హక్కుల సభకు లిబరేషన్ జాతీయ కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వీరబ్రహ్మేంద్రస్వామి వార్షికోత్సవాలు ప్రారంభం



జగ్గంపేటలో వీరంభట్లయ్యను సత్కరిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట: స్థానిక పల్లపు వీధిలో శనివారం శ్రీమద్ జగద్గురు విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 87వ వార్షికోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 29వ తేదీ వరకూ వార్షికోత్సవాలు నిర్వహించనున్నారు. వీరబ్రహ్మంగారి వంశానికి చెందిన 8వ తరం మునిమనవడు బ్రహ్మశ్రీ నోస్పం వీరంభట్లయ్య స్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక వీరబ్రహ్మంగారి ఆలయ కమిటీ సభ్యులు వీరంభట్లయ్యస్వామిని గ్రామంలో ఊరేగించారు. ఆయన బ్రహ్మంగారి సందేశాన్ని ప్రజలకు అందించారు. అనంతరం స్థానిక టీడీపీ కార్యాలయంలో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, మణి దంపతులు వీరంభట్లయ్యను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో దేవదాయధర్మాదాయ శాఖ డిప్యూటీ స్థపతి గోరస శ్రీనివాసచార్యులు, రాజ్యలక్ష్మి దంపతులు, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, స్థానిక నాయకులు మారిశెట్టి భద్రం, ఎస్‌వీఎస్ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో స్వచ్ఛ భారత్



ప్రత్తిపాడులో జాతీయ రహదారి పరిసరాలను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

ప్రత్తిపాడు: కాకినాడ 18వ ఆంధ్రా బెటాలియన్ కమాండర్ మేజర్ ఆసిఫ్ ఇచ్చిన పిలుపు మేరకు ప్రత్తిపాడు మినర్వా విద్యాసంస్థల ఎన్‌సీసీ విద్యార్థులు శనివారం స్వచ్ఛ భారత్ అభియాన్‌ను చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని మినర్వా విద్యాసంస్థల వ్యవస్థాపకుడు డీపీఎస్ రమేష్‌రాజు ప్రారంభించారు. సుమారు 70 మంది ఎన్‌సీసీ విద్యార్థులు ప్లకార్డులు చేతబట్టి, జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. జాతీయ రహదారి, కళాశాల ప్రాంగణంలో వ్యర్థాలు తొలగించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు సత్యనారాయణ, రవికుమార్, కళాశాల ప్రిన్సిపాల్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.